# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-12-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. గుంటూరు జిల్లా మంగళగిరిలోని అఖిల భారత వైద్య, విజ్ఞాన సంస్థ... ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
2. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఉద్దేశించిన 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ లోక్ సభలో ప్రవేశపెట్టారు.
3. దేశవ్యాప్తంగా విద్యాసంస్థల్లో మౌలిక వసతులను మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు.
4. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టంచేశారు.
5. గ్రామాల్లో భూమి సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు.

==========================

దేశంలోనే అత్యాధునిక నగరాల్లో అమరావతి అగ్రస్థానంలో నిలిచేలా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని అఖిల భారత వైద్య, విజ్ఞాన సంస్థ..ఎయిమ్స్ మొదటి స్నాతకోత్సవం ఈ రోజు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 49 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు డిగ్రీలు, పోస్టు డాక్టోరల్ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన మరో నలుగురు విద్యార్థులకు రాష్ట్రపతి బంగారు పతకాలు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావ్ గణపత్‌రావ్ జాదవ్, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, నారా లోకేశ్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చొరవతో 1680 కోట్ల రూపాయల వ్యయంతో రాజధాని ప్రాంతమైన మంగళగిరిలో ఎయిమ్స్ ఏర్పాటైందని తెలిపారు. ఇక్కడ విద్యనభ్యసించి వైద్య పట్టాలు పొందుతున్న విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. తమ ప్రభుత్వం విద్య, వైద్య సదుపాయాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి తెలియజేస్తూ...

**....వాయిస్... 37 సెకన్లు....**

అంతకుముందు కృష్ణాజిల్లా గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు.. గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఘనస్వాగతం పలికారు. అనంతరం విమానాశ్రయంలో పోలీసుల నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు.

---------------------------

లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఉద్దేశించిన 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ముందుకు తీసుకువచ్చింది. దీనికోసం ప్రతిపాదించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా మరో బిల్లును లోక్‌సభలో ఈ రోజు ప్రవేశపెట్టింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ లోక్‌సభలో ఈ బిల్లులను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' బిల్లుకు తెలుగుదేశం పార్టీ బేషరతుగా మద్దతు ప్రకటించింది. ఈ పార్టీ సభ్యులు, కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఈ మేరకు లోక్‌సభలో వెల్లడించారు. కాగా.. జమిలి ఎన్నికల బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పార్టీలు డిమాండ్ చేశాయి.

---------------------------

దేశవ్యాప్తంగా విద్యాసంస్థల్లో మౌలిక వసతులను మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. విద్యారంగంలో చేపట్టిన చర్యలపై ఈ రోజు ఢిల్లీలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ.. గత ఎనిమిదేళ్లలో, విద్యార్థుల వ్యయం 130 శాతం పెరిగిందని వెల్లడించారు. 2013-14లో 10 వేల 780 రూపాయలుగా ఉన్న ఈ మొత్తం 2021-22 నాటికి 25 వేల 43 రూపాయలకు పెరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి పోషణ్ అభియాన్ పథకానికి ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలకు పైగా కేటాయించిందని కేంద్రమంత్రి తెలియజేశారు. ఇకపై జాతీయ పరీక్షల సంఘం.. ఎన్టీఏ ప్రవేశ పరీక్షలు మాత్రమే నిర్వహిస్తుందని ఆయన స్పష్టంచేశారు. 2025 నుంచి నియామక పరీక్షలు ఆ సంస్థ నిర్వహించబోదని ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు.

---------------------------

రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఆరు సూత్రాల ప్రణాళికను సిద్ధం చేసిందని కేంద్ర. వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ రోజు లోక్‌సభలో సభ్యుల ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. 2002-03 ఆర్థిక సంవత్సరంలో రైతుల ఆదాయం నెలకు రెండు వేల 115 రూపాయల నుండి 2018-19 ఆర్థిక సంవత్సరంలో నెలకు పది వేల 218 రూపాయలకు పెరిగిందని తెలిపారు. తమ ప్రభుత్వం చేపట్టిన ప్రయత్నాలు ఫలితాలు ఇస్తున్నాయని అన్నారు. ఉత్పత్తి పెంచడం, ఉత్పత్తి వ్యయాలను తగ్గించడం, ఉత్పత్తులకు న్యాయమైన కనీస ధరలను అందించడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలను భర్తీ చేయడం, వ్యవసాయాన్ని ఆధునీకరించడం, సహజ -సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం వంటి ఆరు సూత్రాలు ప్రభుత్వ వ్యూహమని కేంద్రమంత్రి తెలిపారు. వీటితోపాటు రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు కొనుగోలుకు రాయితీలు కూడా మంజూరు చేస్తున్నామని శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు.

---------------------------

గ్రామాల్లో భూమి సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో భూముల క్రమబద్ధీకరణ, భూసేకరణ ప్రాజెక్టులు,

భూ కేటాయింపులపై ఆయా జిల్లాల కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు, రెవెన్యూ డివిజినల్ అధికారులతో ఆయన ఈరోజు విశాఖపట్నం కలెక్టరేట్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈ సమీక్షకు హోం మంత్రి వంగలపూడి అనితతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా, భూ పరిపాలన విభాగం అదనపు చీఫ్ కమిషనర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి కూడా హాజరయ్యారు. 12 అంశాలతో కూడిన అజెండాపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

---------------------------

రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టంచేశారు. రాష్ట్రంలోని పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను ఆయన ఈ రంగంలో ఆసక్తి ఉన్న పెట్టుబడిదారులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక పాలసీ 2024పై చర్చించేందుకు విజయవాడలో పెట్టుబడిదారులతో రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ... పర్యాటక రంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిశ్రమ హోదా కల్పించారని తెలిపారు. నూతన పర్యాటక పాలసీ, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విధానాన్ని పెట్టుబడిదారులకు మంత్రి వివరించారు. ఈ సందర్భంగా పెట్టుబడిదారుల ఆసక్తులను తెలుసుకుని భవిష్యత్‌లో ఆ దిశగా ముందుకు వెళ్తామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో ఇంకా ఆధార్ నమోదులేని ఆరేళ్లలోపు చిన్నారుల కోసం మరో రెండు వారాలపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు కొనసాగించేలా గ్రామ, వార్డు సచివాలయాల సంచాలకులు ఎం.శివప్రసాద్ ఆదేశాలు జారీచేశారు. రాష్ట్రంలోని ఆరేళ్లలోపు చిన్నారులు 11 లక్షల 65 వేల మంది ఉండగా, నవంబరు 1వ తేదీ నుంచి డిసెంబరు 12వ తేదీ వరకు నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో 64 వేల 441 మంది చిన్నారుల ఆధార్ నమోదైంది. ఇంకా 11 లక్షల మంది వివరాలు నమోదుకాలేదు. దీంతో ఈ రోజు నుంచి 20వ తేదీ వరకు, 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే ప్రత్యేక శిబిరాల్లో ఆధార్ నమోదుతోపాటు, బయోమెట్రిక్ నవీకరణకు అవకాశం కల్పించారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

**.....వాయిస్.... 35 సెకన్లు....**

---------------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభి సీతారామయ్య వర్ధంతి ఈరోజు. 1880 నవంబర్ 24న కృష్ణాజిల్లా గుండుగొలను గ్రామంలో జన్మించిన ఆయన... గాంధీజీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యానంతరం పార్లమెంటు సభ్యునిగా, మధ్యప్రదేశ్ గవర్నర్‌గా వ్యవహరించారు. తెలుగు భాషాభివృద్ధికి ఇతోధికంగా కృషిచేశారు. 1959 డిసెంబర్ 17న ఆయన తుదిశ్వాస విడిచారు.

=====================